నేటి నుంచే జాతరలు

- పెద్దఅడిశర్లపల్లి మండలంలో వెల్లువిరియనున్న ఆధ్యాత్మిక శోభ
- పదిహేను రోజుల పాటు మూడు దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలు
- అలరించనున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు

పెద్దఅడిశర్లపల్లి : మాఘ మాసం వచ్చిందంటే మండలంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడనుంది .. పూజలే కాదు.. ఆటలు.. సాంస్కృతిక మేళవింపుతో మండలంలో సందడి నెలకొంటుంది.. మాఘమాసం పురస్కరించుకొని పెద్దఅడిశర్లపల్లి మండలంలో బాలాజీనగర్, మేడారం, కోదండాపురం గ్రామాల్లో నిర్వహించే జాతర సందడి అంతా ఇంత కాదు.. శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘట్టంతో భక్తులు పరవశించిపోతారు..నేటితో అంకురార్పణ జరగనున్న బ్రహ్మోత్సవాలపై ప్రత్యేక కథనం౯౯

ఒకరిది పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.. ఏళ్ల తరబడి కొనసాగిస్తున్న సంప్రదాయం మరొకది.. ఇలా పెద్దఅడిశర్లపల్లి మండలంలో మాఘమాసం రాగానే ఆధ్యాత్మిక శోభ నెలకొంటుంది. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు స్థానికంగానే కాకుండా వేర్వేరు జిల్లాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.. పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏడాది ఈ మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. వారం రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు.

కమనీయం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్, మేడారం, కోదండాపురంలలో నిర్వహించే జాతర సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత ముఖ్యమైంది. స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతాలకు తరలివస్తుంటారు.. కల్యాణంతో పాటు రథోత్సవ వేడుకలు జాతరకే వన్నె తెస్తుంటాయి. ఉదయం మొదలుకొని రాత్రి వరకు నిర్వహించే ఈ కల్యాణ, రథోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలంబ్రాండ్లు సమర్పిస్తుంటారు.

ఆటలు.. సాంస్కృతిక ప్రదర్శనలు

పీఏపల్లి మండలంలో నిర్వహించే జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిలుస్తున్నాయి. కోలాట బృందం చేసే హడావుడి అంతా ఇంత కాదు.. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో కోలాటం ఆడుతుంటారు.. ఇక దేవాలయాలు విద్యుత్ ప్రభల వెలుగులతో జిగేలుమనిపిస్తుంటారు.. మొత్తంగా ఆధ్యాత్మిక శోభతో మండలం ఒలలాడుతోంది.. దీంతో పాటు జాతరను పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లా స్థాయిలలో కబడ్డీ, క్రికెట్ పోటీలతో యువత ఉత్సాహంగా పాల్గొంటుంది.

బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా..

బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న డేరా కార్యక్రమం, 6 న సీతారామచంద్ర స్వామి పూజాకార్యక్రమం, 8న సీతారాముల కల్యాణోత్సవం ,అగ్నిగుండం, జాతర, ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మేడారం జాతరలో ఆదివారం తెల వారితే 03 న ఉదయం 3 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 04న తెల్లవారితే 05న ఉదయం 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోదండాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17న వేంకటేశ్వరస్వామి పూజలతో మొదలుకొని ఫిబ్రవరి 19 తెల్లవారితే 20న స్వామి వారి కల్యాణోత్సవంతో, 21న రాత్రి తెల్లవారితో 22 న రథోత్సవాలతో ఉత్సవాల ముగియనున్నాయి.


విద్యుత్ దీపాల వెలుగులో బాలాజీనగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయం


కోదండాపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం


మేడారంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం

క్లుప్తంగా

టైలరింగ్ కోర్సు ప్రారంభం


టైలరింగ్ కోర్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

దేవరకొండ : పట్టణంలోని కొండల్‌రావు మహిళా డిగ్రీ కళాశాలలో టైలరింగ్ కోర్సును శనివారం ప్రిన్సిపాల్ రమావత్ రవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ జయమ్మ, వైస్ ప్రిన్సిపాల్ పృథు, రేణుక, జగతి, క్రాంతి, ఆరిఫా, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

మిర్యాలగూడ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్పెషల్ వీడియో టీంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం, అజాగ్రత్త వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, డీఈఓ శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని సీత్య తండాకు చెందిన ధనావత్ బాలాజీనాయక్ దేవుడి ఆంబోతు(సేవ్యసాద్ ఆంబోతు) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆంబోతును గ్రామంలో ఊరేగింపు నిర్వహించి సాంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.


చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దవూర : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూరతో పాటు నాగార్జునసాగర్ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వయస్సు(55) కొంత కాలంగా యాచకునిగా మారి తిరుగుతున్నాడు. ఆ వ్యక్తి గత నెల 29న మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలోని హైవే పక్కన పడిఉండటాన్ని అటు వెళ్తున్న స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 30న మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు రెండు రోజులుగా కమలానెహ్రూ ఆస్పత్రిలోని మార్చురి గదిలో ఉంచామని ఎవరైనా గుర్తిపట్టినట్లయితే ఆ విషయాన్ని పెద్దవూర ఎస్ఐ 8712670198, రైటర్ 9700125494, నాగార్జునసాగర్ సీఐ 8712670153లకు తెలియజేయాలని ఎస్ఐ వీరబాబు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

డిండి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లత్తీపూర్ గ్రామానికి చెందిన మూడావత్ రవి స్థానిక బస్టాండులోంచి తన బైక్‌పై హైవేరోడ్డు దాటుతుండగా అదే సమయంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై ఎగిరి పడిన రవి తలకు తీవ్ర గాయాలాయ్యాయి. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ఝెన్సిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి


అశోక్ (ఫైల్)

చింతపల్లి: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఆవుల అశోక్(50) అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. తోటలోని బావిలో గల మోటారు పనిచేయకపోవడంతో దానిని సరిచేసేందుకు అశోక్ బావిలోకి దిగుతుండగా జారి అందులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి అతడిని బావిలోనుంచి బయటకు తీసి 108 వాహనంలో మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీడీఎస్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్ : పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు వివరాలను వెల్లడించారు. మిర్యాలగూడ మండలం, జంకుతండాకు చెందిన ధనావత్ నరేందర్, వెంకటాద్రిపాలెం కేశవనగర్‌కు చెందిన కేతావత్ సురేష్ టాటా ఇంట్రా మినీ వాహనంలో పీడీఎస్ బియ్యం లోడు చేసుకుని వస్తున్న క్రమంలో రూరల్ ఎస్ఐ పి.లోకేష్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా వాహనంలో రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించి చూడగా అందులో 55క్వింటాల బియ్యం ఉన్నట్లు తేల్చారు. కొద్దిరోజులుగా రేషన్ కార్డుదారుల వద్ద తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఆంధ్రా ప్రాంతంలో అమ్ముతూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని గుర్తించామని వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కాగా ధనావత్ నరేందర్‌పై 2019 నుంచి ఇప్పటి వరకు 10 కేసులు నమోదైనట్లు ఎస్పీ ఆదేశాల మేరకు నరేందర్‌పై రౌడీ షీట్ తెరిచామని పేర్కొన్నారు.

డివిజన్ పరిధిలో 98 కేసులు నమోదు..

కాగా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు పీడీఎస్ అక్రమ కేసులు 98 నమోదు అయ్యాయని, 245మంది నిందితులను అరెస్టు చేశామని 66 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. 560 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నాఉ. అంతేగాకుండా తొమ్మిది మందిపై రౌడీ షీట్ తెరిచామని, ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని తెలిపారు. పీడీఎస్ బియ్యం ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ నాగార్జున, రూరల్ ఎస్ఐ పి. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


వంట సామగ్రిని పరిశీలిస్తున్న డీసీడీఓ సరిత

చింతపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని డీసీడీఓ సరిత కోరారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలతో పాటు ఆదర్శ మోడల్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మెనూలో ఎలాంటి అవకతవకాలు లేకుండా విద్యార్థులకు అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలతో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి సక్రమంగా విధులకు హాజరుకావాలన్నారు. లేకపోతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ అస్రా, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ వాసవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


సమావేశానికి హాజరైన వికలాంగులు

త్రిపురారం : కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితీ(వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.అంతకుముందు త్రిపురారం వీహెచ్‌పీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలంలోని పెద్ద దేవుల పల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే ఖాసీం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా అనుముల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మజ్జిగపు వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా కొండేటి సైదులు, మహిళా విభాగం మండల కన్వీనర్‌గా గోగుల నిర్మల, కుంచం లక్ష్మమ్మ, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, పడిశల జానయ్యలను ఎన్నుకున్నారు. ఎన్నికైనవారికి జిల్లా అధ్యక్షుడు వెంకన్న నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కొళిరెడ్డి చైతన్య రెడ్డి, పలువురు వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

పెద్దవూర : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నిమ్మానాయక్ గ్రామపంచాయతీ పరిధిలోని కిచ్చాసాద్ పెద్దపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోగ్‌బండారుతో గిరిజనులు గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని ఏర్పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, నాయకులు పగడాల నాగరాజు, శంకర్ నాయక్, సీతారాం నాయక్ శ్రీను నాయక్, సక్రం నాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సాగర్ అభివృద్ధి


మినీస్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే సాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం పనులను పరిశీలించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉండి తీసుకొచ్చిన నిధులనే ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు తప్ప కొత్తగా నిధులు తెచ్చింది ఏమీలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై ప్రస్తుత ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హాలియా, నందికొండ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రెండు మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమృత్ పథకం కింద రూ. 59కోట్లు తీసుకవచ్చామన్నారు. సాగర్ అభివృద్ధిపై ప్రస్తుత ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే తపన, ఆరాటం కూడా లేదన్నారు. ముఖ్యమంత్రి మా జేబులో ఉండని చెప్పుకునే ఎమ్మెల్యే అదే ముఖ్యమంత్రిని ఒప్పించి, మెప్పించి సాగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏడాది కాలంగా ఎందుకు నిధులు తీసుకురాలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంపత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు రాంబాబు, సైదాచారి, బందిలి సైదులు, రావుల లింగయ్య, ధర్మారెడ్డి, ఆంజనేయులు, జానకిరాములు, నాగరాజు తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది


మాట్లాడుతున్న ఎంవీఐ వీరస్వామి

మిర్యాలగూడ అర్బన్ : క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరస్వామి, షీటీం, ఎస్ఐ నరేశ్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిక్రీడల్లో ప్రతిభ కనబర్చి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చిన్ననాటి నుంచి క్రీడలు ఆడిన వారికి శారీరకంగా, మానసికంగా ఉత్సాహవంతులు అవుతారని శరీరం ధృడంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.కె.జరాజన్, ఉపాధ్యాయులు సుజన్‌కుమార్, వై.ప్రసాద్, రాధిక, నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హాలియా : పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోనాల శివయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ శనివారం హాలియా పట్టణంలో వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కోనాల శివయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అదే విధంగా ఇబ్రహీంపేటలో ఇటీవల మృతి చెందిన పేరూరి కోటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అలీనగర్‌లో ప్రమాదవశాత్తు గాయపడ్డ షేక్ ఎక్బాల్‌ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర నాయకులు సంపత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన గ్రామ మాజీ ఉప సర్పంచ్ లింగాల మొగలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, నాయకులు శాగం కోటిరెడ్డి, నరేష్, రవి, ఏడుకొండలు, చెన్నయ్య, సైదులు, వెంకన్న, రవీందర్, ప్రసాద్, మహేష్, మోహన్ ఏసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పెద్దవూర గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సతీశ్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.42వేల చెక్కును శనివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అందజేశారు. నిరుపేద ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందించే సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రవీంద్రచారి, రమేష్, మల్లి, హరిబాబు, పుల్లంరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన జిల్లేపల్లి శ్రీనివాస్ తండ్రి జిల్లేపల్లి కొండయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ప్రగాఢసానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముప్పా అరుణ్‌కుమార్, నాయకులు అల్లి పెద్దిరాజు, నడ్డి లింగయ్య, రమణరాజు, రాఘవరెడ్డి, మన్మథరెడ్డి, పుల్లంరాజు, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని స్పోర్ట్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొండా శ్రీశైలంయాదవ్, యూనూస్, ముత్యాల సర్వయ్య, హరికృష్ణ, ఎస్‌వీటి, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జానకిరెడ్డి మృతి సీపీఎంకు తీరనిలోటు

వేములపల్లి(మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని పాములపాడుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు యాతం జానకిరెడ్డి మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం ఈ విషయం తెలుసుకున్న ఆ జూలకంటి రంగారెడ్డి జానకిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి జానకిరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆయన వెంట రొండి శ్రీనివాస్, పాదూరి శశిధర్‌రెడ్డి, తంగెళ్ల నాగమణి, శ్రీను, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రామచంద్రన్, లింగయ్య, రాములు, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచేలా కృషిచేయాలి


విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ రాము

నాగార్జునసాగర్ : విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ తరి రాము అన్నారు. నాగార్జునసాగర్ హైలాన్ కాలనీ లోని ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అనుభవజ్ఞులైన ఉత్తమ ఉపాధ్యాయులతో విద్యను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేశ్వరీ తండ్రి జ్ఞాపకార్థంగా పాఠశాల విద్యార్థులకు రూ.5వేల విలువ చేసే టై, బెల్టులను అందజేశారు. పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ పొందిన నీలమ్మను పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శేషు, ఉపాధ్యాయులు రమణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

న్యూకిడ్స్ స్కూల్‌లో మాతృ పాద పూజ


తమ తల్లుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు

హాలియా : శ్రీవసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక న్యూకిడ్స్ స్కూల్‌లో శనివారం మాతృ పాదపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మ జాగరణ సమితి రాష్ట్ర నాయకులు మురళీ శర్మ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మనాది రవీందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లోని అభ్యాస్ టెక్నో స్కూల్‌లో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్ వంగాల పుష్పలతలు మాట్లాడుతూ చిన్నారులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించరన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాండురంగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్పనా చావ్లాకు నివాళి


నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రవీంద్రనగర్‌లోని రవీంద్రభారతీ హైస్కూల్‌లో శనివారం అంతరిక్ష వ్యోయగామి కల్పనా చావ్లా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఆ స్కూల్ కరస్పాండెంట్ కందుల మధుసూదన్‌రెడ్డి, బీసీ జేఏసీ కో కన్వీనర్ చేగొండి మురళి యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతరిక్ష యానం చేసిన మొట్టమొదటి భారతీయ మహిళ అని, ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి, వెంకట్‌రెడ్డి, స్వరాజ్యం, జ్యోతి, సుమతి, అసిఫ్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ

కొండమల్లేపల్లి : మండ కేంద్రంలోని నల్లగొండ రోడ్డు వైపు పలు గ్రామాలకు వెళ్లే ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులను శనివారం ఎస్ఐ రామ్మూర్తి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోకూడదని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆదిరాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జంగయ్య, ఆటో కార్మికులు శ్రీరాములు, కొండల్, పెద్దిరాజు, సంజీవ, రామకృష్ణ, రామయ్య పాల్గొన్నారు.


గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎస్ఐ

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం నుంచి మార్చి 20వ తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ సమయంలో అల్పాహారం అందించనున్నట్లు స్థానిక జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం పాఠశాలలో అల్పాహారం అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పది వార్షిక పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎం.జనారదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సుధాకర్, ప్రభావతి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వర్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.